క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యపరీక్షలు



కన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కన్నారం, రాజిపేట, వెంకట్రావ్‌పేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు మజీదాబేదం, లక్ష్మి, రేణుక, రిబిక ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు పరీక్షలు చేసి, అవసరం ఉన్నవారికి రోగనిరోధక టీకాలు ఇచ్చారు. రక్తహీనతను నివారించేందుకు ఆకుకూరలు, పాలు, కోడిగుడ్లు ఆహారంలో అధికంగా తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు ఏసుమని, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పల్లెదవాఖాన ఫర్నిచర్‌కు నిధులు మంజూరు

చేగుంట(తూప్రాన్): మండలంలోని గొల్లపల్లి గ్రామ పల్లె దవాఖానకు ఫర్నిచర్ కోసం ఎంపీ రఘునందన్‌రావు చొరవతో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ రూ.50 వేలు మంజూరు చేసినట్లు గ్రామ మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం మెదక్ కలెక్టర్ కార్యాలయానికి అభివృద్ధి ప్రణాళిక సమావేశానికి వచ్చిన మెదక్ ఎంపీని కలిసిన గొల్లపల్లి మాజీ సర్పంచ్ పల్లెదవాఖానలో ఫర్నీచర్ సమస్యను వివరించారు. దీంతో ఎంపీ జిల్లా వైద్యాధికారిని పిలిపించి ఎల్లారెడ్డితో వినతిపత్రం అందజేశారు. స్పందించిన జిల్లా వైద్యాధికారి రూ.50 వేల ఫర్నీచర్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.

జంగరాయిలో ఉచిత వైద్య శిబిరం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంఓలని జంగరాయి గ్రామంలో మెడిసిటి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు బీపీ, షుగర్, ముక్కు, చెవి, గొంతు, వరిబీజం, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సల కోసం మెడిసిటి ఆస్పత్రికి రెఫర్ చేశారు. అనంతరం ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంజయ్, సురేష్, నాగార్జున, జీపీ సెక్రటరి శైలజ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బందెల ప్రభాకర్, శ్యామ్ పాల్గొన్నారు.

విద్యార్థులు కలిసిమెలిసి చదువుకోవాలి

చేగుంట(తూప్రాన్): విద్యార్థులంతా కలిసిమెలిసి చదువుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చక్రవర్తి అన్నారు. చేగుంటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలతో పాటు తరగతి గది నిర్వహణకు సంబంధించిన హాస్య నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్‌లు పాల్గొన్నారు.

వినాయకుడికి పూజలు



వినాయకుడికి పూజలు చేస్తున్న విద్యార్థులు

రేగోడ్(మెదక్): మండలంలోని జగిర్యాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వినాయకుడిని ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం అన్నపూర్ణ తెలిపారు. వినాయకచవితి పండుగ సందర్భంగా విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరించినట్లు ఆమె పేర్కొన్నారు.

హెచ్‌ఎంలకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ నీలకంఠం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో యుడైస్ పై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి నీలకంఠం హాజరై మాట్లాడుతూ.. శిక్షణను సద్వినియోగం చేసుకొని, పాఠశాలకు సంబంధించి విషయాలను కచ్చితంగా పొందుపరచాలన్నారు. ఆన్‌లైన్ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. త్వరలోనే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష ఉంటుందని, దానికి అనుగుణంగా విద్యార్థులకు బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ రెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పర్యావరణం కలుషితం కాకుండా అందరూ మట్టి వినాయకులను పూజించాలని అవగాహన కల్పించారు. మట్టి గణపతుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.



వెల్దుర్తి(తూప్రాన్): మట్టి గణపతి విగ్రహాలతో విద్యార్థులు



పాపన్నపేట(మెదక్): విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతులు



చేగుంట(తూప్రాన్): వడియారం ఉన్నత పాఠశాలలో మట్టి వినాయకులతో విద్యార్థులు



శివ్వంపేట(నర్సాపూర్): చిన్నగొట్టిముక్ల పీఎస్ పాఠశాలలో విద్యార్థులు



నిజాంపేట(నర్సాపూర్): వెల్మకన్నలో గణపతులతో విద్యార్థులు



హవేళిఘణాపూర్(మెదక్): తయారు చేసిన మట్టి వినాయకులతో విద్యార్థులు



నర్సాపూర్ రూరల్: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సభ్యులు

ఉపాధ్యాయులు మన్ననలు పొందాలి

జిల్లా విద్యాధికారి రాధాకిషన్

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయులు విద్యార్థుల మన్ననలు పొందినప్పుడే గుర్తింపు వస్తుందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మండలంలోని చందాయిపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు అజితకు రాష్ట్రస్థాయి లయన్స్ అవార్డు అందజేత కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ నీరజ, హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు లక్ష్మణ్, వెంకట్‌రాంరెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రాంచంద్రం, జిల్లా చైర్మన్‌లు లింగమూర్తి, సుఖేందర్, ఉపాధ్యాయులు విఠల్‌రెడ్డి, నర్సింలు, శంకర్, యాదగిరి, స్వప్న, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలు రజితకు లయన్స్ రాష్ట్ర స్థాయి అవార్డు అందిస్తున్న జిల్లా విద్యాధికారి

నిబంధనలు తప్పనిసరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న గణేశ్ మంటపాల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ యాదగిరి అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంటపాల్లో విద్యుత్ కోసం సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రయాణికులకు, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ప్రశాంత వాతావరణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

రుణమాఫీ రైతుల వివరాల సేకరణ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో రుణమాఫీ కానీ రైతుల వివరాలను ప్రత్యేక యాప్‌లో వ్యవసాయ అధికారులు నమోదు చేస్తున్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయానికి వచ్చిన రైతుల వివరాలను యాప్‌లో ఏఈఓలు నమోదు చేశారు. ఆధార్‌లో తప్పులు ఉండి రుణమాఫీ కాని రైతులు బ్యాంకులో సంప్రదించాలని ఇన్‌చార్జి ఏఓ నాగం కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, వినీత్, అఖిల్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ల పంపిణీ

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు సీటీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన 50 మంది విద్యార్థులకు ఈ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ధర్మకాంటకు 'అధర్మ' కరెంట్

పాపన్నపేట(మెదక్): నిరుపేదలు తమ పూరి గుడిసెకు పక్క ఇంటి నుంచి కరెంట్ కనెక్షన్ తీసుకుంటే కరెంటోళ్లు కేసులు బనాయిస్తున్నారు. కానీ లంచాలకు అలవాటు పడిన సిబ్బంది మాత్రం మూతబడిన రైస్ మిల్లు అధీనంలో నడిచే ధర్మ కాంటకు కరెంట్ కనెక్షన్ ఇస్తూ స్వామి భక్తిని చాటుకుంటున్నారు. మెదక్– బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారిపై నార్సింగి శివారులో గల ఓ రైస్‌మిల్ వివిధ కేసుల్లో ఇరుక్కొని సుమారు పదేళ్ల క్రితం మూతబడింది. అప్పటి నుంచి దానికి కరెంట్ కనెక్షన్ కట్ చేశారు. కానీ దాని అధీనంలో గల ధర్మకాంటకు మాత్రం అక్రమ కరెంట్ కనెక్షన్ నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. ప్రధాన రాహదారిపై.. విద్యుత్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఇంత జరుగుతున్నా అటు వైపు అధికారులు తొంగిచూడడం లేదు. ధర్మ కాంటకు సమీపంలో గల మెకానిక్ షెడ్డు నుంచి అక్రమ విద్యుత్ సరఫరా కొనసాగుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై సంబంధిత డివిజనల్ ఇంజినీర్‌ను వివరణ కోరగా..ఈ విషయం ఇటీవలే తన దృష్టికి వచ్చిందని, తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న ధర్మకాంట

ముమ్మరంగా రైతు రుణమాఫీ సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): రేషన్‌కార్డులేని రైతుల రుణమాఫీకి సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం చివరి రోజు అని చెప్పడంతో సర్వేకోసం చాలా మంది రైతులు వచ్చారు. మండల కేంద్రం కౌడిపల్లితో పాటు వివిధ గ్రామాల్లో ఏఓ స్వప్న, ఏఈఓలు సౌజన్య, సాహితి, గ్రామాల్లో రైతు రుణమాఫీ సర్వే నిర్వహించారు.



రైతు రుణమాఫీ సర్వే చేస్తున్న అధికారులు

ఇళ్లు కూలిన వారికి డబ్బులు మంజూరు

శివ్వంపేట(నర్సాపూర్): వారం రోజుల క్రితం వర్షాలతో కూలిపోయిన ఇళ్లకు సంబంధించి నిధులు మంజూరయ్యాయి. మండల వ్యాప్తంగా 26 ఇళ్లు పాక్షికంగా, ఒక ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో అందుకు సంబంధించిన ఇళ్లను రెవెన్యూ సిబ్బంది పరిశీలించి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో కూలిపోయిన ఇళ్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. 27 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ. లక్ష 55 వేల మంజూరైనట్లు ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్ తెలిపారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్ చెప్పారు. పాక్షికంగా ఇల్లు కూలిన వారికి రూ.3 వేల 200, పూర్తిగా కూలిపోయిన వారికి రూ.95 వేల 100 వచ్చినట్లు చెప్పారు.

నార్సింగి పోలీస్‌స్టేషన్ తనిఖీ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి పోలీస్‌స్టేషన్‌ను రామాయంపేట సీఐ వెంకట రాజాగౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు, కేసుల ఫైల్స్ పరిశీలించారు. అనంతరం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్‌ఐ అహ్మద్ మోహినోద్దీన్‌కు సూచించారు.



నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ వెంకటరాజాగౌడ్

నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామస్తులు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి తిరుపతి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిల్వనీటితో దోమలు చేరి సీజనల్ వ్యాధులకు కారణమవుతాయన్నారు. గ్రామంలో తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోయాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజిపేటలో ఫ్రైడే.. డ్రైడే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మండలంలోని రాజిపేటలో ఏఎన్‌ఎం లక్ష్మి, రేణుక, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఆశవర్కర్లు ఇంటింటికీ తిరిగి నీటితొట్లు, పాడైపోయిన డబ్బాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.



కౌడిపల్లి(నర్సాపూర్): రాజిపేటలో నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వార్డ్ కౌన్సిలర్ కల్యాణి మధుసూదన్ రావు ఆధ్వర్యంలో వార్డులోని పలు ప్రాంతాలతో పాటు ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, హాస్టల్ వద్ద పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతతో పాటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తద్వారా రోగాలు దరిచేరవని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్, వార్డు అధికారి నగేష్, జవాన్ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష

శివ్వంపేట(నర్సాపూర్): పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని ఐసీడీఎస్ శివ్వంపేట సెక్టార్ సూపర్‌వైజర్ సంతోష పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పోతిరెడ్డిపల్లి తండాలో పోషణ మాసోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం తండాలో ఫ్రైడే డ్రైడే నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమలో అంగన్‌వాడీ టీచర్ మౌనిక, పంచాయతీ కార్యదర్శి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో శుక్రవారం వీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సాయం చేయడం తన అదృష్టమన్నారు. విద్యార్థులు మంచిగా కష్టపడి చదివి అభివృద్ధిలోకి రావాలని ఉపాధ్యాయుల మార్గ దర్శకత్వంలో నడవాలని తెలిపారు. ఒత్తిడి లేని చదువు నేర్చుకోవాలని మంచి మార్కులు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మారెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, తాజా మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ గౌస్, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, కుమారస్వామి, ఫాతిమాభాను తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట(మెదక్): రాంపూర్‌లో వీఎంఆర్ ఫౌండేషన్ క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న మహేందర్ రెడ్డి

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల విచారణ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఎంపీడీఓ శ్రీనివాస్ శుక్రవారం విచారించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇంటి స్థలాలను క్రమబద్ధీకరణ చేసేందుకుగాను ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో కౌడిపల్లిలో సుమారుగా 500 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తును విచారణ చేసి, క్రమబద్ధీకరించేందుకు నిర్ణయించడంతో విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. విచారణలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు సక్రమంగా ఉంటే దరఖాస్తుదారుడు స్థలం విస్తీర్ణం ఆధారంగా డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు.



కౌడిపల్లిలో పంచాయతీ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై విచారణ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

సస్యరక్షణ చర్యలతో పత్తిపంట భద్రం

మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే పత్తిపంట భద్రంగా ఉండడంతో పాటు, అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని చండూర్ గ్రామంలో పతి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి ముంపు వచ్చి, తగ్గిన పత్తి పంటలో తేమ ఆరుదలకు వీలైనంత త్వరగా అంతర కృషి చేయాలని, ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పోటాష్ నీటి ముంపు తగ్గాక, బూస్టర్ డోస్‌గా వేయాలన్నారు. పత్తిలో మెగ్నిషియం దాతువు లోపానికి ఆవకాశం ఉందని, మెగ్నిషియం సల్ఫేట్‌ను పిచికారీ చేయాలన్నారు. పత్తికాయ దశలో ఉన్న ప్రాంతాల్లో అఇక వర్షాలతో శిలీంద్రం ఆశించి కాయలు కుళ్లిపోతాయన్నారు. దీని నివారణకు శిలీంద్ర నాశినులైన కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు, పోషమైసిన్ ఒక గ్రాము లేదా ప్లాంటమైసిన్ ఒక గ్రాము, 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వేరుకుళ్లు తెగులు ఉన్నట్లయితే కాపర్ ఆక్సిక్లోరైడ్ మొక్క చుట్టూ పోయాలన్నారు. ఆకుమచ్చల నివారణకు ప్రోపికోన్‌జోల్ 1 ఎంఎల్, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమ్య, రైతులు పాల్గొన్నారు.



చండూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ రాజశేఖర్, ఏఈఓ రమ్య

దెబ్బతిన్న పంటల పరిశీలన

అల్లాదుర్గం(మెదక్): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో దెబ్బతిన్న పంటలను ఏఓ రాజేశ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పత్తిపంటతో పాటు ఇతర పంటల వివరాలను ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షపు నీరు పత్తి చేలలో అధికంగా నిల్వడం వల్ల పంటలు దెబ్బతిన్నాయని, వీటి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ అమృత్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలో నీరు నిల్వ లేకుండా చూసుకోండి

టేక్మాల్(మెదక్): కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పత్తి పంటలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ సూచించారు. శుక్రవారం టేక్మాల్ మండలంలోని బొడమట్పల్లి గ్రామంలో పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాలతో వేరు కుళ్లు తెగులు సోకినట్లయితే కాపరాక్సీ క్లోరైడ్ ద్రావణం మొక్క చుట్టూ పోయాలన్నారు. ఆకుమచ్చల నివారణకు ప్రోపి కొన్ జోల్ 1 మిల్లీలీటర్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయలన్నారు. పత్తికాయ దశలో ఉన్న ప్రాంతాల్లో అధిక వర్షాల వలన శిలీంద్రం ఆశించి కాయలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని వాటి నివారణకు కాపరాక్సి క్లోరైడ్‌ను నీటిలో కలిపి మొక్క వద్ద వేయాలన్నారు. వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత 19:19:19 పిచికారీ చేయాలన్నారు.ఇందులో ఏఈవో లక్ష్మి తదితరులు ఉన్నారు.



అల్లాదుర్గం(మెదక్): పత్తిపంట వివరాలు సేకరిస్తున్న ఏఓ రాజేశ్‌కుమార్

సంక్షిప్త వార్తలు

◆ **చీటికి మాటికి కరెంట్ కట్**

నర్సాపూర్: పట్టణంలో చినుకు పడితే చీటికి మాటికి కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడి వినియోగదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్నందున వర్షం సరఫరాలో అంతరాయం కల్గుతుంది. పగలు, రాత్రి తేడా లేకుండా కరెంట్ నిలిచిపోవడంతో తాము చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ **అలరించిన వినాయక మాస్కులు**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందాపూర్ ప్రాథమిక పాఠశాలలో వినాయక మాస్కులతో విద్యార్థులు సందడి చేశారు. శుక్రవారం చందాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినాయక మాస్కులను ధరించి విద్యార్థులు అలరించారు.

◆ **ఆరోపణలు చేయడం సరికాదు మున్సిపల్ వైస్‌చైర్మన్ నహీమొద్దీన్**

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిపై ఆరోపణలు చేయడం సరికాదని మున్సిపల్ వైస్‌చైర్మన్ నహీమొద్దీన్ కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. శుక్రవారం నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ మారారంటూ ఎమ్మెల్యే సునీతారెడ్డిని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ఏ పార్టీ నుంచి వచ్చాడో గుర్తుంచుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు శేఖర్, సత్యంగౌడ్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శివకుమార్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాబ్యానాయక్, బీఆర్‌ఎస్ నాయకులు షేక్ హుస్సేన్, రాజేందర్, ప్రసాద్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **అల్లాదుర్గం ఎంపీడీఓగా చంద్రశేఖర్**

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం నూతన ఎంపీడీఓగా ఎస్.చంద్రశేఖర్ శుక్రవారం నియమితులయ్యారు. శివ్వంపేట మండలంలో సూపరింటెండెంట్‌గా పనిచేసి పదోన్నతిపై మండలానికి ఎంపీడీఓగా వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

◆ **యువకులను విచారించిన పోలీసులు**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గోమారం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటనలో పోలీసులు పలువురు యువకులను శుక్రవారం విచారించారు. గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయం విధితమే. బుధవారం రాత్రి పలువురు యువకులు గ్రామంలో సంచరిస్తున్న గుర్తు తెలియని వ్యక్తిపై దాడి చేయడంతో అతడు మృతిచెందాడని గ్రామస్తులు తెలపడంతో అనుమానిత వ్యక్తులను పోలీసులు విచారించారు. గుర్తు తెలియని మృతదేహనికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి నర్సాపూర్ మున్సిపాలిటీ అధికారులకు అప్పగించామని రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని తూప్రాన్ సీఐ రంగాకృష్ణ తెలిపారు.

◆ **టేక్మాల్ ఎంపీడీవోగా విఠల్**

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండల నూతన ఎంపీడీవోగా విఠల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొల్చారం మండల సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న విఠల్ టేక్మాల్ ఎంపీడీఓగా పదోన్నతిపై వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న రియాజుద్దీన్ ఎంపీఓగా కొనసాగతారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓను సన్మానించారు.

◆ **ఇళ్లు కూలినవారికి ఆర్థికసాయం**

చిన్నశంకరంపేట(మెదక్): భారీ వర్షంతో ఇళ్లు కూలిపోయి నిరాశ్రయులైన ముగ్గురు నిరుపేదలకు రూ.5,200 చొప్పున నార్సింగి తహసీల్దార్ కరీం అందించారు. శుక్రవారం నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన అయ్యవారి భాగ్యమ్మ, సంకాపూర్ గ్రామానికి చెందిన గజగట్ల సులోచన, ముక్కెరి శేఖవ్వలకు నగదును అందించారు. కార్యక్రమంలో నార్సింగి ఆర్‌ఐ నవీన్‌కుమార్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కేశవులు, నర్సింలుగౌడ్, సంతోష్, బాలకృష్ణగౌడ్, మల్లేశం పాల్గొన్నారు.

◆ **పీసీసీ అధ్యక్షుడి ఎన్నికపై హర్షం**

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బీసీ నాయకుడు మహేశ్ కుమార్‌గౌడ్ నియామకంపై కాంగ్రెస్ మండల నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. నాయకులు కృష్ణాగౌడ్ హైదరాబాద్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. వీరబోయిన గోపాల్, సత్యనారాయణ, శ్రీనివాస్, ఎర్కలి నర్సింహ, నర్సింహచారి, రమేశ్‌చారి, సత్యనారాయణ, మస్తాన్, యాదగిరి యాదవ్ తదితరులు తెలిపారు.

